ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
https: epaper.prabhathasamacharam.com
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
మంగళవారం | 18 నవంబర్ 2025 | 11 పేజీలు




# వచ్చే నెలలో స్థానికం




# ఉట్నూర్‌లో సాండ్ బజార్ ప్రారంభం

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తీరిన ఇసుక సమస్య
- సాండ్ బజారును ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక సమస్య తీరింది. ఇసుక దొరక్క ఇళ్ళ నిర్మాణలు ముందుకు సాగక లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని లబ్దిదారులకు ఇసుకను అందుబాటులో ఉంచేందుకు ఉట్నూర్‌లో సాండ్ బజారు ఏర్పాటు చేసారు. తెలంగాణ మినరల్ డేవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజారును సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సాండ్ బజార్ ఏర్పాటు జిల్లాలోనే మొదటిది కావడం విశేషం. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉట్నూర్ సాండ్ బజార్ ఏర్పాటుపై ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరం అయ్యే ఇసుక సమస్య తీరినట్లేనన్నారు. టన్ను ఇసుకకు రూ 12వందలు చెల్లించాలని, ఇసుక కావాల్సిన వారు 155242కి టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సాండ్ బజార్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదిలాబాద్ జిల్లా, పరిసర ప్రాంత గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు, సామాన్య ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండే విధంగా ఉట్నూర్‌లో సాండ్ బజార్‌ను ఏర్పాటు చేశామన్నారు.




## ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోళ్లు బంద్

- రాష్ట్ర కాటన్ అసోసియేషన్ నిర్ణయంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిలిచిపోయిన కొనుగోళ్లు
- సీసీఐ నిబంధనలను సడలించాలని డిమాండ్
- పత్తి చుట్టూ ముదురుతున్న రాజకీయం
- నేడు భైంసా, ఆదిలాబాద్‌కు రానున్న కేటీఆర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిచి పోయాయి. సీసీఐ నిబంధనలు సడలించాలని వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు డిమాండ్ చేస్తూ కొనుగోళ్లను బంద్ చేయాలని పిలుపునిచ్చారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా పత్తి కొనుగోళ్లు జరగలేదు. నాలుగు రోజుల ముందుగానే కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో పత్తి రైతులు కూడా మార్కెట్లకు సరుకు తీసుకురాలేదు. మిల్లుల కేటగిరిని నిలిపివేయాలని, కపాస్ కిసాన్ యాప్‌లో సడలింపులు ఇవ్వాలని, అన్ని మిల్లులకు అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో వైపు పత్తి కొనుగోళ్ల చుట్టూ రాజకీయం ముదురుతోంది. అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ అంశానికి తెరలేపింది. ప్రతిపక్ష పార్టీల నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతులను పట్టించుకోకపోవడం లేదని ఆరోపిస్తున్నారు. నేడు భైంసా, ఆదిలాబాద్ మార్కెట్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారని, పత్తి రైతుల సమస్యలను తెలుసుకోనున్నట్లు ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు.




## ఇళ్ల ఇర్మాణం అడ్డుకోవద్దు

- బలవంతం వెళ్లగొడితే.. ప్రాణాలకు తెగిస్తాం
- ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం అధ్యక్షుడు సొనేరావ్
- చట్టం రాకముందే అడవిని నమ్ముకున్నాం
- ఐటీడీఏ ఎదుట ధర్నా ఆదిమ కొలాం గిరిజనుల ధర్నా
- దొంగచింత, సోనాపూర్, నాగపూర్, కొలంగూడ నుంచి పెద్ద ఎత్తున గ్రామస్థుల పాదయాత్ర

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే ఆదివాసీ బిడ్డలం అడవులలో నివాసముంటూ జీవనం కొనసాగిస్తున్నామని, ప్రభుత్వాలు చట్టాలను వారికి అనుకూలంగా మర్చుకోని ఇప్పుడు తమల్ని ఇళ్లు నిర్మించుకోకుండా అటవీ ప్రాంతాల నుంచి వెళ్లగొట్టేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. వారు వెళ్లగొడితే తాము వెళ్లిపోయ్యేందుకు సిద్ధంగా లేమని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సొనేరావ్ హెచ్చరించారు. ఆదివాసీ కొలాం కులస్తుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐటీడీఏ ఉట్నూర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బంది చర్యలు

- రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ
- ఇందారంలో బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు




## అభివృద్ధి పనులకు కేంద్రం కృషి



వివరాలు 11లో

## వణుకుతున్న గిరిజనులు

- సిర్పూర్ (యూ)లో 7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు
- ఆసిఫాబాద్ జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతలలో అత్యల్పంగా సిర్పూర్ (యు) మండలంలో 7 డిగ్రీలు నమోదైంది. ఉష్ణోగ్రతలు పడిపోతూ ఉండటంతో ఏజెన్సీ ప్రాంతంలో చలి తీవ్రత పెరిగి, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.





## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని
# వాటిని సాధించేలా కృషి చేయాలి

**సత్ఫలితాలు ఇస్తున్న పోలీసు అక్క కార్యక్రమం**
**వారంలో జిల్లా వ్యాప్తంగా 53 కార్యక్రమాలు,**
**12 ఫిర్యాదుల స్వీకరణ**
**8 ఈ పెట్టి కేసులు, 4 కౌన్సిలింగ్‌లు**
**పోలీస్ అక్క ద్వారా ఫిర్యాదులు**
**ఎలాంటి సమస్యలు ఉన్న షీ టీం 8712659953**
**నంబర్‌కు సంప్రదించాలి**
**ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)** బాలికలు గొప్ప లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని కష్టపడి సాధించే దిశగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. సోమవారం స్థానిక కలెక్టర్ చౌరస్తాలోని బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలీసు అక్క కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ, డిఐఈఓ, ఆదిలాబాద్ డిఎస్పి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు అధికారులు కలిసి జాతీయ గేయాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల విద్యార్థినిలు దేశభక్తిని చాటేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అక్క అనే కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, విద్యార్థులు ధైర్యంగా తమ సమస్యలను పోలీసు అక్క అనే తోబుట్టువుకు తెలియజేస్తున్నారని, జిల్లా పోలీసు యంత్రాంగం సత్వర చర్యలతో వారం రోజులలో 8 ఈ పెట్టి కేసులు నాలుగు కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు రక్షణగా జిల్లా పోలీసు వ్యవస్థ ముందుందని తెలిపారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఉన్న నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. మహిళలకు రక్షణగా ఆదిలాబాద్ షీ టీం, పోలీసు అక్క, జిల్లా పోలీసు వ్యవస్థ 24 గంటలు అందుబాటులో ఉంటాయని డయల్ 100 ద్వారా లేదా 8712659953 అనే నెంబర్ ద్వారా సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. మహిళలు విద్యార్థినులకు పాఠశాలల నందు, లేదా కళాశాల నందు, ఇంటికి వెళ్లే దారి మార్గంలోనైనా ఎలాంటి ఇబ్బందులకు, ఈవ్ టీజింగ్లకు గురైన ధైర్యంగా తెలియజేయాలని సూచించారు. మహిళలకు మహిళల పట్ల ఉన్న చట్టాలు, పోక్సో చట్టం అంశాలపై వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు రోడ్డు భద్రత నియమాలు పాటించేలా, వాహన నియమ నిబంధనలు పాటించేలా ప్రోత్సహించాలన్నారు. ఎంచుకున్న ఏఏ రంగంలోనైనా కష్టపడితే ఆ రంగంలో ఉన్నత శిఖరాలకు అందుకోవచ్చని, ఎంచుకున్న రంగం ఉత్తమమైనదిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ జాదవ్ గణేష్, డిఎస్పీ జీవన్ రెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ నాగరాజు, కళాశాల ప్రధానోపాధ్యాయుడు సూరత్ సింగ్, షీటీం బృందం, పోలీసు అక్క, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







## బాధితుల సమస్యల పట్ల
# ప్రత్యేక దృష్టి సారించాలి
### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)** బాధితుల సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించిన ఎస్పీకి జిల్లా నలుమూలల నుండి సుదూర ప్రాంతాల వారు నేరుగా ఫిర్యాదులను సమర్పించి వారి సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలను తెలియజేసిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి ఫిర్యాదుల పట్ల వారి సమస్యల పట్ల వెంటనే సిబ్బందిని కేటాయించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయానికి 23 ఫిర్యాదులు అందజేయని తెలిపారు. సుదూర ప్రాంతాల ప్రజలు జిల్లా ఎస్పీ గారికి సమాచారం అందించాలన్న ఫిర్యాదులను తెలియజేయాలన్న వాట్సప్ ద్వారా 8712659973 నెంబర్ కు సంప్రదించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ముఖ్యంగా అసాంఘిక కార్యకలాపాల సమాచారం, నేరస్తుల సమాచారం, గంజాయి మాదక ద్రవ్యాల సమాచారం, ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న వాట్సాప్ సందేశం ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ కాస్ట్‌లో పరిహారం కాజేసేందుకు కుట్ర

- **ఏళ్లుగా సాగులో ఉన్న వారికి అన్యాయం..**
- **సమగ్ర విచారణ చేసి పరిహారం ఇవ్వాలి..**
- **కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్ కాసిపేట భూ బాధితులు.**



**కాసిపేట, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దుబ్బగూడెంలో గల కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్‌లో పరిహారం కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారని కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్ కాసిపేట, దుబ్బగూడెం భూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో భూ బాధితులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దుబ్బగూడెం ఓపెన్ కాస్ట్‌లో భూమి సాగు చేసుకున్నది తామైతే, పరిహారం మాత్రం భూమికి సంబంధం లేని వారికి, అక్రమార్కులకు ఇచ్చేందుకు కుట్రలు చేస్తున్నారని మండి పడ్డారు. దుబ్బగూడెం శివారు 146 సర్వే నెంబర్‌లోని 67 ఎకరాల భూములు ఎన్నో ఏళ్లుగా సాగు చేశామని, పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతూ ఇతరులకు పరిహారం ఇచ్చేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. సర్వే నెంబర్ 144లో భూములకు సంబంధించి పరిహారం విషయంలో రూ. 1.30 కోట్ల అవినీతి జరిగిందని, దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు అధికారులు బుకాయిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల వచ్చిన వారు ఎస్టీల పేరుతో పరిహారం కొట్టేద్దామని చూస్తున్నారని, వెంటనే అధికారులు వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న బీసీలు, ఎస్సీలకు ఇవ్వమని, భూములు లేని ఎస్టీలకు ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, రెవెన్యూ అధికారులు, సింగరేణి అధికారులు మూడుసార్లు సర్వే చేసినా కూడా ఈ సమస్యకు ఎటువంటి న్యాయమైన పరిష్కారం చూపలేదన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బగూడం, కాసిపేట ఓపెన్ కాస్ట్ భూ బాధితులు బిజ్జూరి రాయలింగు, కందికట్ల చంద్రకళ, గోనెల శ్రీనివాస్, రత్నం రామస్వామి, రామటంకి రాజేందర్ గోనె లచ్చయ్య, కలాలి బాల శంకర్, లక్ష్మీ పాల్గొన్నారు.

# నిర్దేశించిన సమయంలోపు పనులు పూర్తి చేయండి



**ఆదిలాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)** జిల్లాలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సోమ రాజేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ఆన్‌లైన్ ఎంట్రీలు, ప్రత్యేక కార్యక్రమం 5.0, తదితర విద్యా సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అవసరమైన అర్హతల నమోదు, ప్రత్యేక కార్యక్రమం 5.0 పురోగతి, పాఠశాల స్థాయి డేటా అప్‌డేట్లు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎంట్రీలను వెంటనే ముగించాలనే దిశగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అన్ని పాఠశాలలు నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి, సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సెక్టోరల్ అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు భైంసాకు కేటీఆర్ రాక

**లోకేశ్వరం, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)** రైతులు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో మంగళవారం భైంసాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు వస్తున్నారని వస్తున్నారని బీఆర్ఎస్ ముధోల్ సమన్వయ నాయకులు విలాస్ గాదేవర్, పడకంటి రమాదేవి తెలిపారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో పత్తి రైతుల కష్టాలను తెలుసుకోవడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్, భైంసాకు సందర్శించనున్నారని తెలిపారు. వరుసగా సీసీఐ కొనుగోళ్ళు బంద్, తేమ శాతంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ నేపథ్యంలో కేటీఆర్ భైంసా మార్కెట్‌ను సందర్శించనున్నారు. బీఆరెస్ కార్యకర్తలు, శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**మంచిర్యాల, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
వివిధ సమస్యలపై అర్జిదారులు ప్రజావాణి కార్యక్రమంలో అందిస్తున్న దరఖాస్తులను అధికారులు సమన్వయంతో పని చేసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం వేలాల గ్రామానికి చెందిన గుందోజు రాజేందర్ తాను సాదాబైనమా ద్వారా కొనుగోలు చేసిన భూమిని తన పేరిట పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన నాగవత్ కమల తాను సమ్మర్ క్యాంప్ లో పాఠశాల తరగతులు చెప్పానని, వేతనం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని శివాజీ బాండ్ రోడ్ కాలనీ వాసులు దరఖాస్తులో తమ వార్డులో త్రాగునీటి సరఫరా సమయాన్ని ఉదయం 3.45 గంటల నుండి ఉదయం 6 గంటలకు మార్చవలసిందిగా కోరారు. తాండూర్ మండల కేంద్రానికి చెందిన జంశెట్టి బొందయ్య తన ఇంటికి గృహ జ్యోతి పథకం వర్తింపచేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం కాసిపేటకు చెందిన దుర్గం చంద్రయ్య సింగరేణి సంస్థ కొరకు తీసుకున్న తన భూమికి సంబంధించి ఆలస్యమైన పరిహారంపై వడ్డీ చెల్లించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్ కు చెందిన ఇష్రత్ సుల్తానా తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామానికి చెందిన షేక్ బాబర్ తన తాతల నుండి వచ్చిన భూమిని అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేసి వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 27 దరఖాస్తులు అందాయని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## నిందితుడు పరారీ కేసులో ముగ్గురు పోలీసులపై సస్పెన్షన్ వేటు..!

**బోథ్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుండి ఓ నిందితుడు పరారీ అయిన ఘటనలో ముగ్గురు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు జిల్లా ఉన్నతాధికారులు వారిని సస్పెండ్ చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కొన్ని రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లా సోనాల మండలంలోని కోటా(కే) గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలి భర్త తనకు ఇంటి నిర్మాణానికి సంబంధించిన డబ్బులు ఇవ్వడం లేదని గుత్తేదారు సత్యనారాయణ అతడిని పట్టుకుని చెట్టుకు కట్టేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు గుత్తేదారుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయగా అదే రోజు రాత్రి బాత్ రూమ్ వెళ్తా అని చెప్పి పోలీసుల నుండి నిందితుడు తప్పించుకొని పారిపోయాడు. అయితే పారిపోయిన నిందితుణ్ణి పోలీసులు పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే నిందితుడు స్టేషన్ నుండి పారిపోయిన విషయం పై విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు జిల్లా ఉన్నతాధికారులు ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



**బెజ్జూర్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గ్రామపంచాయతీ కార్యదర్శి, వైకుంఠం, బిజెపి కార్యకర్తలతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసినట్లయితే లబ్ధిదారుల ఖాతాలలో డబ్బులు జమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేనికి శ్యాంసుందర్, సామల తిరుపతి, పొన్న ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# కిష్టాపూర్‌లో కలప పట్టివేత

**జన్నారం, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
కవ్వాల్ టైగర్ రిజర్వ్ జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని కిష్టాపూర్‌లో జోరుగా అక్రమ కలప రవాణా కొనసాగుతుంది. కిష్టాపూర్‌లో కొందరు కలప అక్రమ రవాణా దారులు విలువైన టేకు కలపతో మంచాలు చేయించి విక్రయిస్తున్నారు. ఆదివారం కిష్టాపూర్ గ్రామం నుంచి బొలెరో వాహనంలో మంచాలు తరలిస్తుండగా మండల కేంద్రంలోని ఎఫ్‌డీవో కార్యాలయం చౌరస్తాలో అటుగా వస్తున్న ఎఫ్‌డిఓ రామ్మోహన్ ఆ వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు. దీంతో వాహనంలో రూ.26వేల విలువచేసే టేకుతో చేసిన మంచాలు ఉన్నాయని, వాటిని పట్టుకొని జన్నారం అటవీ రేంజ్‌కు తరలించడం జరిగిందన్నారు. వాహనాన్ని కలపను సీజ్ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ అధికారులు కిష్టాపూర్ గ్రామంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ కలప రవాణా చేసిన




నిలువ ఉంచిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**నిర్మల్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యకరమైన జీవనశైలికి నేచురోపతి ఎంతో ఉపయోగకరం

## మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య




**మంచిర్యాల, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
ఆరోగ్యకరమైన జీవనశైలికి నేచురోపతి ఎంతో ఉపయోగకరమని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం 8వ జాతీయ నేచురోపతి దినోత్సవంను పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మైత్రి యోగా అండ్ నేచర్ కేర్ సెంటర్- మంచిర్యా, సత్త్వ నేచర్ కేర్, యోగా, ఆయుర్వేద రిట్రీట్- చెన్నూర్ సమన్వయంతో జిల్లా అధికారులకు ఏర్పాటు చేసిన నేచురోపతి అవగాహన కార్యక్రమానికి మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనప కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలికి నేచురోపతి ఎంతో ఉపయోగకరమైన, నేచురోపతి చికిత్స ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, జీవనశైలి సంబంధిత వ్యాధులు, ఒత్తిడి సమస్యలను నియంత్రించవచ్చని తెలిపారు. మానవ జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండడం ఎంతో ముఖ్యమైనదని, ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలినికి అవలంబిస్తూ సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. సంస్థ వ్యవస్థాపకులు, నేచురోపతి, యోగా వైద్యురాలు డా. పోటు సమీర రెడ్డి మాట్లాడుతూ నేచురోపతి సహజమైన, సురక్షితమైన, శాశ్వత ఆరోగ్యాన్ని అందించే పద్ధతి అని, అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. సుకుమార్ కె.ఎన్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నర్మదేశ్వర స్వామిని దర్శించుకునన ఎమ్మెల్యే

**బోథ్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
మండలంలోని కైలాష్ టెకిడి దేవస్థానంలో శ్రీ నర్మదేశ్వర స్వామిని సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొని, గ్రామ ప్రజల అభివృద్ధి, మండల ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం స్వామివారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవస్థానం అభివృద్ధి విషయాలపై ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమై అవసరమైన సౌకర్యాలపై స్పందించారు. వీరితో పాటు బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.








# నిర్మల్ పట్టణంలో ఘనంగా యూనిటీ మార్చ్

**నిర్మల్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను పురస్కరించుకొని నిర్మల్ పట్టణంలో సోమవారం సాయంత్రం యూనిటీ మార్చ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడెం నగేష్, నిర్మల్, ముధోల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్‌లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు ర్యాలీ ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఈ ర్యాలీ సాగింది. మార్గమధ్యంలోని వివేక్ చౌక్‌లో గల స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ర్యాలీ అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సామూహికంగా జాతీయ గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మాట్లాడుతూ, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను పురస్కరించుకొని యూనిటీ మార్చ్ కార్యక్రమం నిర్వహించుకోవడం సంతోషకరమైన విషయం అని అన్నారు. స్వాతంత్రం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని వివరించారు. అనేక రాజ్యాలుగా ఉన్న మన దేశాన్ని మొత్తం ఏకం చేశారని వివరించారు. నిజాం రాజ్యాన్ని కూడా హైదరాబాదులో స్వతంత్ర భారతదేశంలో వీలీనం చేసిన గొప్ప వ్యక్తి సర్దార్ పటేల్ అని తెలిపారు. నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్రం తర్వాత కూడా నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రాన్ని భారత దేశంలో కలపడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చోరువ మరువలేని తెలియజేశారు. దేశ ఐక్యత కోసం ప్రతిక్షణం పరితపించిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని చెప్పారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ను స్ఫూర్తిగా తీసుకొని దేశ ఐక్యతలో ప్రతి ఒక్కరు తోడ్పాటును అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యత స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత నేటితరం యువతపై ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ దేశ సమైక్యత సమగ్రత కొరకు పాటుపడాలని చెప్పారు. స్వాతంత్రం అనంతరం తన చాతుర్యంతో రాజ్యాలన్నింటినీ ఏకం చేసి, దృఢమైన భారత దేశాన్ని రూపొందించాలన్నారు. అంతకుముందు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర సంగ్రామంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ గొప్ప పోరాటం చేశారని అన్నారు. స్వాతంత్రం తొలినాళ్లలో అనేక స్వతంత్ర రాజ్యాలను ఏకం చేసి సంపూర్ణ భారతదేశాన్ని స్థాపన చేశారని కొనియాడారు. భారత తొలి ఉప ప్రధానిగా, తొలి కేంద్ర హోం శాఖ మంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారని వివరించారు. దాదాపు 600 వరకు చిన్న, పెద్ద స్వతంత్ర రాజ్యాలను భారతదేశంలో వీలీనం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా యూత్ ఆఫీసర్ శైలి బెల్లాల్, డివైఎస్‌ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## క్రీడల్లో నిర్మల్ పేరును నిలబెట్టాలి

**నిర్మల్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

క్రీడల్లో నిర్మల్ పేరును నిలబెట్టేలా క్రీడాకారులు ఎదగాలని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో విద్యాశాఖ అండర్ 17 బాల బాలికల క్రికెట్ ఎంపిక పోటీలు ప్రారంభించారు. డీఈఓ మాట్లాడుతూ ఇష్టమైన క్రికెట్ ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, క్రికెట్ క్రీడలో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో ఎంపికై రాబోయే రోజుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అదేవిధంగా జాతీయస్థాయికి ఎంపిక జిల్లా పేరును నిలపాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రవీందర్ గౌడ్, రాజు నాయక్, భూమన్న, అంబాజీ, డేవిడ్ బెన్వర్, దేవేందర్, హరిప్రసాద్, పెంట అశోక్, నిర్మల్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు రమణ రావు, ఎం శ్రీనివాస్, శ్రీనివాస్, నచ్చేందర్, మారుతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**దస్తూరాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

దస్తురాబాద్ మండలం బుట్టాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మామిడి పోచయ్య ఇటీవల పాము కాటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

# అర్లి మార్గం ఒక్కటే వంతెన కథ ఇంతేనా..!

**లోకేశ్వరం, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

మండలవాసులు జిల్లా కేంద్రమైన నిర్మల్ జిల్లాకు వెళ్లాలంటే అర్లి మార్గం ఒక్కటే శరణ్యం. ఈ రోడ్డులో సుద్దవాగుపై 1980లో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకోగా ఇదివరకే పలుమార్లు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టిన అధికారులు దీనిపై నుంచి భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు. గత పదేళ్లుగా వంతెన నిర్మాణానికి అడుగులు పడలేదు. కానీ ఆరు మాసాలుగా మండలానికి వచ్చిన ప్రతిసారి ఎమ్మెల్యే రామారావు పటేల్ అర్లి నుంచి లోకేశ్వరం వరకు రహదారి, సుద్దవాగుపై వంతెన నిర్మాణం కోసం హామ్ పద్ధతిలో రూ.84 కోట్లు మంజూరయ్యాయని చెప్ప చెప్ప డంతో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ తొలి దశలో ఆర్అండ్ బీ పరిధిలో అర్లి నుంచి లోకేశ్వరం వరకు రహదారి నిర్మాణం కోసం రూ.24 కోట్లు మంజూరయ్యాయని అధికా రులు పేర్కొనడంతో కథ మళ్లీ



మొదటికొచ్చింది. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరుకాకపోవడంతో స్థానికులు నిరాశ చెందుతున్నారు. వెంటనే వంతెనకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. వంతెన నిర్మించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాద నలు పంపామని ఆర్ అండ్ బి డీఈఈ సునిల్ కుమార్ తెలిపారు

## విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

**నిర్మల్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా తమ ప్రదర్శనలు తయారు చేయడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో కార్యాలయంలో విద్యావ్యవస్థ ఎన్జీసి ఆధ్వర్యంలో నిర్మల్ వేస్ట్ టు వెల్త్ వృథా వస్తువుల నుంచి సంపదను సృష్టించడం అనే అంశంపై నిర్వహించిన పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హరిజనవాడ, తిమ్మాపూర్ ఖానాపూర్ కు చెందిన అద్భుతమైన కళాకృతులు, గృహా అలంకరణ పశువులను తయారు చేసి అందరి ప్రశంసలు పొంది రెండవ బహుమతి సాధించారు. ఈ



పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థి కె.సూరజ్ ప్రధానోపాధ్యాయురాలు కే.సుజాత సూచనలు సలహాల మేరకు కళాకృతులను తయారు చేశాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బోథ్ డెవలప్ మెంట్ ఫోరం వాట్సాప్ గ్రూపు అడ్మిన్‌పై కేసు నమోదు

**బోథ్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

బోథ్ డెవలప్మెంట్ ఫోరం అనే వాట్సాప్ గ్రూపులో రెచ్చగొట్టే మెసేజ్ పెట్టిన బి. శ్రీనివాస్ అనే వ్యక్తి, ఆ గ్రూప్ అడ్మిన్ అయిన పి. రమేష్ అనే వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు బోథ్ ఎస్సై శ్రీ సాయి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సామాజిక మాద్యమాలలో ఇరు వర్గాలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, క్రిమినల్ కంటెంట్ వచ్చే ఏ మెసేజ్ పెట్టిన వారిపై, ఆ గ్రూపుల అడ్మిన్‌లపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయన్నారు.

# బుగ్గ ఆలయ అర్చకుడిని సస్పెండ్ చేయాలి

**బెల్లంపల్లి, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీరాంబట్ల వేణుగోపాల శాస్త్రిను విధుల నుండి తొలగించాలని సోమవారం మాజీ దేవస్థాన కమిటీ చైర్మన్ మంద అనిత, పాత బెల్లంపల్లి మాజీ సర్పంచ్ బూట్ల వెంకటలక్ష్మి, మైనార్టీ నాయకులు ఎండి గౌస్ లు దేవాదాయ శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిశీలకులు రంగు రవి కిషన్ గౌడ్ కు ఫిర్యాదు చేశారు. తాజాగా ఒక మహిళా భక్తురాలపై అసభ్యంగా ప్రవర్తించిన తీరుపై మాజీ దేవస్థాన కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి శ్రీరాములు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దేవస్థానానికి వచ్చే మహిళల పట్ల అమర్యాదగా, అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో మహిళలు దేవస్థానానికి రావడానికి భయపడుతున్నారని వారు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అర్చకులు వేణుగోపాల శాస్త్రిని దేవాదాయ శాఖ అధికారులు



గతంలో అనేకసార్లు సస్పెండ్ చేసినప్పటికీ పరిస్థితి లో మార్పు రావడంలేదని పేర్కొన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దేవస్థానానికి కళంకం తీసుకు వస్తున్న అర్చకులు వేణుగోపాల శాస్త్రిని వెంటనే విధుల నుండి తొలగించి మహిళలకు రక్షణ కల్పించాలని వారు కోరారు. అర్చకులు వేణుగోపాల శాస్త్రి పై రాష్ట్ర దేవాదాయ శాఖ విజిలెన్స్, జాయింట్ కమిషనర్ కు భక్తుల నుండి ఫిర్యాదులు అందడంతో అతనిపై విచారణకు వచ్చినట్లు పరిశీలకులు రంగు రవి కిషన్ గౌడ్ తెలిపారు. జాయింట్ కమిషనర్ కృష్ణవేణి ఆదేశాలతో భక్తులను విచారించినట్లు చెప్పారు. అర్చకులు వేణుగోపాల శాస్త్రిని దేవస్థానంలో పూజలకు అనుమతించవద్దని క్లర్క్ భానును ఆయన ఆదేశించారు.



## ప్రజావాణి అర్జీలను
# పెండింగ్‌లో పెట్టవద్దు

**ఆదిలాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామల దేవి, రాజేశ్వర్లు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీపై వెంటనే స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్లు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి, భూభారతి సహా వివిధ విభాగాలకు చెందిన మొత్తం 82 దరఖాస్తులు అందాయని, వాటిని శాఖల వారీగా త్వరితగతిన పరిశీలించి పురోగతి వివరాలు దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, డిప్యూటీ కలెక్టర్ వంశీ కృష్ణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దలను గౌరవించాలని వాకింగ్




**ఆదిలాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

వయోవృద్ధుల వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణం నుంచి జగ్జీవన్ రామ్ చౌక్ వరకు వయోవృద్ధుల నడక ర్యాలీ నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి మిల్క ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో సీనియర్ సిటిజన్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జిల్లా వయోవృద్ధుల సమాఖ్య సభ్యులు, సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి ర్యాలీలో పలు అవగాహన సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, అధికారులు యశోద, జిల్లా సమైక్య అసోసియేట్ అధ్యక్షులు గంగాధర్, సభ్యులు దయాకర్ రెడ్డి, ఈ. ప్రకాష్, శ్యామ్ రాజ్ గౌడ్, ఆర్. కిషోర్, దేవన్న, పోశెట్టి పాల్గొన్నారు.

# చేప పిల్లల పంపిణీ

**బెల్లంపల్లి, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని పోచమ్మ చెరువు వద్ద సోమవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల కుటుంబాలకు అండగా నిలుస్తుందన్నారు. నియోజకవర్గంలో మత్స్యకారులు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి పథకాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తొంగలమల్లేష్, బత్తుల రవి, భామండ్లపల్లి భరత్ తదితరులు పాల్గొన్నారు.



# మాజీ మావోయిస్టుకు కంటికి శస్త్ర చికిత్స చేయించిన కోటపల్లి పోలీసులు

**కోటపల్లి, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పారుపల్లి గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు ఆత్రం లచ్చన్న, భార్యతో కలిసి గత కొద్ది నెలల క్రితం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రజలకు చేస్తున్నటువంటి సహాయ సహకారాలను చూసి లొంగిపోయారు. మావోయిస్టుల పట్ల చూపిస్తున్న ఆదరణను గుర్తించి తెలుసుకుని, తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకొని లొంగిపోయాడు. మాజీ మావోయిస్టుకు పోలీస్ శాఖ తరుపున ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఎలాంటి సహాయం, సమస్య ఉన్న అండగా ఉంటామని ఇచ్చిన మాట ప్రకారం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చెన్నూర్ రూరల్ సీఐ బన్సీలాల్, కోటపల్లి ఎస్ ఐ రాజేందర్ ఆత్రం లచ్చన్న కు కంటి చికిత్సను మంచిర్యాల లోని పవన్ ఆప్టికల్స్ ద్వారా ఉచితంగా కంటి



చికిత్స చేయించినట్లు తెలిపారు ఈసందర్భంగా చెన్నూర్ రూలర్ సీఐ మాట్లాడుతూ పోరు వద్దు ఊరు ముద్దు అనే నినాదంతో మావోయిస్టు లు ఆయుధాలను విడిచి జనజీవన స్రవంతిలో కలవాలని చెన్నూర్ రూలర్ సీఐ అన్నారు. ఇందుకు పోలీస్ శాఖ అన్నివిధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని తెలిపారు.

# మంత్రిని కలిసిన భైంసా నాయకులు





**లోకేశ్వరం, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

హైదరాబాద్‌లో మార్కెట్ కమిటీ అసోసియేషన్ తరపున భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షిందే ఆనందరావు పటేల్ సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రిని మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం అవసరమైన నిధులను విడుదల చేయాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా వివరించారు. షిందే ఆనందరావు పటేల్ మాట్లాడుతూ...ప్రస్తుతం సిసిఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న పత్తితో పాటు సోయాబీన్ పంట ను కూడా అదనంగా కొనుగోలు చేయేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. పత్తి మిల్లుల యజమానులు పత్తి కొనుగోలు చేయకుండా యూనిట్లు మూసివేస్తుండటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. తరువాత ఆయన మంత్రి సీతక్క, వ్యవసాయ శాఖ సలహాదారుడు సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఐఏఎస్ సెక్రటరీ సురేందర్ మోహన్ లను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు.

# నూతన సర్కిల్‌గా జైపూర్ ఏర్పాటు

**జైపూర్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి మంచిర్యాల జిల్లాలో నూతన సర్కిల్‌గా జైపూర్ ఏర్పాటైంది. ఇప్పటి వరకు శ్రీరాంపూర్ పోలీస్ సర్కిల్ పరిధిలో జైపూర్ పోలీస్ స్టేషన్ కొనసాగింది. ఈ క్రమంలో జైపూర్, భీమారం పోలీస్ స్టేషన్లను కలిపి సర్కిల్‌గా ఏర్పాటు చేశారు. మంచిర్యాల సైబర్ క్రైమ్‌లో విధులు నిర్వహిస్తున్న కె. నవీన్ కుమార్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు.



## సాదా బైనామా
# దరఖాస్తులు పరిష్కరించాలి

**కుంటాల, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

రైతులు సాదా బైనమాలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం రోజు వీడియో కాన్ఫరెన్స్ లో అధికారులకు ఆదేశించారు. పెండింగ్ ఉన్న సాదా బైనమా దరఖాస్తులను విచారణ చేపట్టి వెంటనే పరిష్కారం చూపాలని రైతులకు న్యాయం చేయాలని తెలియజేశారు. అదేవిధంగా తాసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కారం చూపి సత్కారం ప్రజలకు సేవ చేసే విధంగా కృషి చేయాలని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. అదేవిధంగా ఆయా శాఖల పనితీరుపై ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతిని మండల వ్యాప్తంగా వేగవంతంగా చేపట్టాలని తెలిపారు ఇందిరమ్మ ఇల్లు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా ఆయా శాఖల అధికారులకు ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఆడే కమల్ సింగ్ ఎంపీ ఓ ఎం ఏ అబ్దుల్ రహీం మిషన్ భగీరథ ఏ ఈ దత్తురాం ఏపీవో గట్టుపల్లి నవీన్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దగుడుంబా, దేశీదారు తయారీ
# దారులకు రూ.50వేలు జరిమానా

**గుడిహత్నూర్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలం గుట్టపక్క తండా గ్రామానికి చెందిన మట్ట చందర్ సింగ్ పలుమార్లు మహారాష్ట్రకు చెందిన దేశీదారు అమ్ముతూ పట్టు బడటంతో రూ. 30వేలు, అలాగే గుడిహత్నూర్ మండలం లోని ముత్నూర్ గ్రామానికి చెందిన జమున అనే మహిళ పలుమార్లు గుడుంబా తయారు చేస్తూ దొరకడంతో రూ. 20,000 జరిమానాను సోనాల, గుడిహత్నూర్ తహసీల్దార్‌లు విధించారు. అయితే సోమవారం జరిమానా ను సదరు వ్యక్తులు చలాన్ రూపంలో కట్టినట్లు ఎక్సైజ్ సీఐ జూల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. ఎవరైనా గుడుంబా గానీ, మహారాష్ట్రకు చెందిన లిక్కర్ తీసుకు వచ్చిన అమ్మిన, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



# నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు

## రామకుంగుం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



**జైపూర్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. ప్రమాదాల నివారణ చర్యలకు డీజీపీ చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ఇం దారం క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదాలు జరిగే స్థలాలను ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, హెచ్ఆర్‌కే సంస్థ అధికారులతో కలిసి సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా మూల మలుపు వద్ద ఏర్పాటు చేస్తున్న ఐల్యాండ్‌ల ఏర్పాటు, డిజైన్, గతంలో ప్రమాదాలు జరగడానికి గల కారణాలు, ప్రమాదాల నివా రణకు చర్యలు, రేడియం బ్లింకర్స్, స్టడ్స్, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రమాద స్థలాల గుర్తింపు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల కు గురై ఎన్నో కుటుంబాలు మనో వేదనకు గురవుతున్నాయన్నారు. ప్రతీ రోజు జరుగుతున్న రోడ్డు ప్ర మాదాలను గుర్తు పెట్టుకుని ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. మద్యం సేవించి అతి వేగంగా వాహనాలు నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాద రహిత రామగుండం కమిషనరేట్‌గా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉండాలన్నారు. అరైవ్ అలైవ్ ద్వారా విద్యార్థులు, యువతలో రోడ్డు భద్ర తపై అవగాహన పెంపొందించడమే కాకుండా ట్రాఫిక్ నియాలను పాటిం చాల్సిన అవసరం స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గో దావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, రోడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ రమేష్‌బాబు, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



## గ్రంథాలయాలు విజ్ఞన బండగారాలు

**నిర్మల్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

విజ్ఞానంతోనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అటువంటి విజ్ఞానాన్ని అందించడంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జున్ మంద్ అలీ అన్నారు. సోమవారం 58వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గ్రంథాలయంలో విద్యార్థులకు పాఠకులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాందేడపు చిన్ను కాంగ్రెస్ పట్టణం అధ్యక్షులు, జునేత్ డిస్ట్రిక్ట్ మైనారిటీ ప్రెసిడెంట్, కిజర, సందీప్, గ్రంథాలయ అధికారులు పి విజయ, శ్రీ రాథోడ్ మోహన్ సింగ్, కట్కం సంజీవరెడ్డి, గుండాల పృథ్వి రాజ్, భోజనం లెనిన్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**నిర్మల్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్, మామడ, దిలావర్ పూర్, నర్సాపూర్, సోన్, లక్ష్మణచందా మండలాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య కారణాల వల్ల ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన వారు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, పట్టణ మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

### పుణ్య ఫలం దక్కాలని..

## రాలిన దైవ పుష్పాలను ఏరి

**ఆదిలాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

పారిజాత పుష్పాలు.. అక్టోబరు, నవంబరు, డిసెంబరు ఈ మూడు నెలల్లోనే రాత్రిపూట వికసిస్తాయి. వేకువ జామున నేల రాలుతాయి. ఇవి చాలా సువాసన కలిగి ఉంటాయి. వీటిని చెట్టు నుంచి కోయకుండా నేలపై రాలిన పారిజాత పుష్పాలను మాత్రమే పూజకు వాడటం వెనుక పురాణాల్లో అనేక గాథలు ఉన్నాయి. సత్యభామ కోరిక మేరకు శ్రీకృష్ణుడు దేవ లోకానికి వెళ్లి, ఇంద్రుణిడిని జయించి పారిజాత వృక్షాన్ని భూలోకానికి తీసుకొచ్చారని, అందుకే అది దైవ పుష్పంగా ఖ్యాతి పొందింది. ఇంద్రుడి శాపం కారణంగా ఈ పూలు రాత్రివేళల్లో మాత్రమే వికసిస్తాయి. ఉదయానికి రాలిపోయి చెట్టుకింద నేలపైన తివాచీ పరిచినట్లుగా పడతాయి. దేవతా పుష్పాలు కావడంతో కింద పడినా ఎలాంటి దోషం ఉండదని, వీటికి మాలిన్యం ఉండదని, పారిజాత పుష్పాలను దేవతార్చన చేస్తే సకల శుభాలు కలుగుతాయని, పుణ్యఫలం దక్కుతుందని భక్తుల నమ్మకం.



## టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : డీటీసీవో డాక్టర్ సుమలత



**నార్నూర్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

టీబీ రహిత సమాజానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని డీటీసీవో డాక్టర్ సుమలత అన్నారు. సోమవారం నార్నూర్ మండలం తడిహత్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. గ్రామస్తులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించి టీబీ వ్యాధి పట్ల గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరికైన టీబీ వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఒకవేళ టీబీ ఉన్నట్టు నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు వైద్య సలహాలతో పాటు ఉచితంగా పంపిణీ చేసే మందులను ఉపయోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఎవరు కూడా టీబీ వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు,హెచ్ఈవో తులసి దాస్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్, టీబీ కోఆర్డినేటర్ సుదర్శన్ ఎస్‌టీఎస్ లక్ష్మణ్, ఏఎన్ఎం సింధు, కైలాష్, జవహర్, ఈశ్వర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిన గీతం వందేమాతరం



**మంచిర్యాల, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

స్వాతంత్ర్య పోరా టంలో ప్రజలందర్నీ ఏకతాటిపైకి తెచ్చింది వందేమాతర గీతం అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణం లోని మార్కెట్ రోడ్డులో సామూహిక వందేమాతర గీతాలాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంకించంద్ర చటర్జీ రచించిన వందే మాతర గేయం స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలందరిలో పోరాట స్ఫూర్తిని రగిలిచిందన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన వారిని ప్రతి ఒ క్కరు తలుచుకుంటూ వారి ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కా ర్య క్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు గాజుల ముకేష్‌గౌడ్, పురషోత్తం జాజు, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, కృష్ణ మూర్తి, శ్రీశైలం, చక్రవర్తి, వేణుగోపాల్, కమలాకర్‌రావు, ప్రభాకర్, శ్రీధర్, నాగేశ్వర్‌రావు, తిరుపతి, వెంకటేశ్వర్లు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై పోలీసుల స్పెషల్ డ్రైవ్

**మందమర్రి :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని బురదగూడెం, అందుగులపేట జాతీయ రహదారిపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ.. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.



## అయ్యప్ప పడిపూజకు ఆహ్వానం

**లోకేశ్వరం, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

వాలేగాం గ్రామంలో అయ్యప్పమహా పడిపూజ శనివారం జరగబోయే మహా పడిపూజ శ్రీ సంజీవ్ నంబూద్రి గురు స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం కార్యక్రమానికి మన ముధోల్ శాసనసభ్యులు పవర్ రామారావు పటేల్‌ను ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా భైంసా మండల అధ్యక్షులు దిగంబార్, బీజేవైఎం భైంసా మండల ఉపాధ్యక్షులు గంగాప్రసాద్, తాజా మాజీ సర్పంచ్ పోతన్న, బిజెపి సీనియర్ నాయకులు,మారుతి పటేల్, సాయినాథ్ పటేల్, గురు స్వాములు మారుతి పటేల్,నవీన్ రెడ్డి, నాగరాజప్ప, తదితరులు గ్రామ అయ్యప్ప సన్నిధన స్వాములు పాల్గొన్నారు.

### అనుమతి లేకుండా పంట

## కొనుగోలు చేస్తే కఠిన చర్యలు

**బోథ్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

సోనాల మండల కేంద్రంలో అనుమతులు లేకుండా మొక్క జొన్న, పత్తి, సోయబిన్ కొనుగోలు చేస్తున్న గోపాల్ అనే వ్యక్తి షాపును తనిఖీ చేసి 58 బస్తాలు మక్కలు 60 కిలోల పత్తిని సీజ్ చేసి సెక్రటరీ ఏఎంసీ బోథ్‌కు అప్పగించినట్లు తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా పంటల కొనుగోలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. పంటల అమ్మకం కొనుగోలు చేయడానికి ట్రేడింగ్ లైసెన్స్ తప్పనిసరి అని తెలిపారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ, ఏఎంసి సెక్రటరీ ఉన్నారు.





## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**నస్పూర్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్‌లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆద్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ చంద్రయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పని చేసే కార్మికుల డాటాను పంపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందన్నారు. మూడు దశాబ్దాలుగా మున్సిపాలిటీలో పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, వాటర్ సరఫరా, ఎలక్రిషన్స్, వివిధ విభాగాల్లో కార్మికులు పని చేస్తున్నరన్నారు. 60 సంవత్సరాలకు పైబడిన వారి స్థానంలో వారి యొక్క కుటుంబ సభ్యుల కు ఒక్కరి అవకాశం కల్పించాలన్నారు. వారి కుటుంబ సభ్యుల పిల్లల పేర్లను సీడిఎంఏ కార్యాలయంకు పంపాలని కోరారు. 60 సంవత్సరాల పైబడిన వారికి పీఎఫ్, ఈఎస్ఐ వర్తించకపోవడం వలన ప్రభుత్వ పరంగా వచ్చే మెడికల్ పీఎఫ్ పెన్షన్ రాకపోవడంతో నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. కార్మికులకు తగిన న్యాయం జరిగే విదంగా వారసత్వ ఉద్యోగాలు వచ్చే విధంగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ అధ్యక్షుడు కోయ్యల వెంకటి, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ ఎండి సోయల్ ఖాన్, నాయకులు రాజేందర్, సుధాకర్, సాగర్, తిరుపతి, సత్యనారాయణ, రజిత, అశోక్, దుర్గమ్మ, పద్మ, రమా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## రైల్వే లోకో పైలట్ ధర్నా

**బెల్లంపల్లి, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
కేంద్ర ప్రభుత్వం లోకో పైలట్‌లు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ ఛైర్మన్ నాగరాజు ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్‌లోని లోకో పైలట్స్ కృులాబీ కార్యాలయం ఎదుట సోమవారం లోకో పైలట్స్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రైల్వే వ్యవస్థకు మూల కారణమైన లోకో పైలట్ షిఫ్ట్ నెలలో 4 కాకుండా రెండుకు తగ్గించాలని, 36 గంటల్లో పైలట్స్ హెడ్ క్వార్టర్స్ కువచ్చే విధంగా నిబంధనలు కేంద్ర ప్రభుత్వం అమలు పర్చాలని నాగరాజు డిమాండ్ చేశారు. కాని విధి నిర్వహణలో పైలట్స్ 70 గంటలు పనిచేయాల్సి వస్తుందని లోకో పైలట్స్‌పై కేంద్ర ప్రభుత్వం అధిక పని భారం మోపుతుందని పేర్కొన్నారు. బెల్లంపల్లి, బల్లార్షా రామగుండం, పంద్రపాణి రైల్వే గూడ్స్ డిపోల్లో గల రన్నింగ్ రూమ్స్‌ను ఆధునీకరించి అభివృద్ధిపర్చాలని, వాటిలో మహిళా లోకో పైలట్లకు తగు సౌకర్యాలు కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోకో పైలట్స్ కు 25శాతం కిలో మీటర్ ఫర్ అలవెన్స్ చెల్లించాలని, 2024 జనవరి 1 నుంచి 120 కిలో మీటర్ల మైలేజీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైల్వే లోకో పైలట్లకు డిపోలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, సీనియర్ నాయకుడు రవీందర్‌లు ఇచ్చిన పిలుపులో భాగంగా బెల్లంపల్లిలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో లోకో పైలట్లు పాల్గొని విజయవంతం చేశారని ఆయన తెలిపారు. ఇన్కమ్ టాక్స్ లో కిలోమీటర్ ఫర్ అలవెన్స్ తొలగించాలని గూడ్స్ 42 గ్రేడ్ పే ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ సాంబశివుడు, కోశాధికారి షోకేష్ మీనా, నాయకులు హేమ, నికిత, ఎస్‌షా పాల్గొన్నారు.



## సీఐటీయూ ఆధ్వర్యంలో
# మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



**లక్షెట్టిపేట, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయ న్నారు. పది నెలలుగా పెండింగ్లో ఉన్న కోడిగుడ్ల బిల్లులు, జీతాలు, మెనూ బిల్లులు ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో కార్మికులు అప్పుల చేసి బడి పిల్లలకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారని అన్నారు. కార్మికుల పట్ల ప్రభుత్వ విధానం సరైనది కాదన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేం అధికారంలోకి వస్తే పది వేలు వేతనం చెల్లిస్తామని చెప్పి మాతో ఓట్లు వేయించుకొని , అధికారంలోకి వచ్చిన తర్వాత మా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వలన మాకు కిరాణా దుకాణంలో సరుకులు కూడా ఉద్దెర ఇవ్వడం లేదన్నారు. ఇప్పుడు కొత్తగా 60 ఏండ్లు నిండిన కార్మికులను తొలగిస్తామంటున్నారు. అది సరైనది కాదన్నారు. గత ప్రభుత్వంలో ఐదు నెలల టిఫిన్ డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. కోడిగుడ్లను, గ్యాస్ ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు వచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రతి కార్మికురాలికి ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత,పెన్షన్ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే రాబోయే రోజుల్లో పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పోసమ్మ, అమృత, శంకరమ్మ, లక్ష్మి, లచ్చవ్వ మల్లేశ్వరి,జానకి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ కళా సమితి ఆధ్వర్యంలో అందెశ్రీకి ఘన నివాళి

**జన్నారం, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
“ఆదర్శ కళా సమితి”జన్నారం ఆధ్వర్యంలోజన్నారం మండల కేంద్రలోని పొనకల్ గ్రామ పంచాయతీ ఆవరణంలో అందె శ్రీకి ఘనంగా నివాళులు ఆర్పించడం జరిగిందని ఆదర్శ కళా సమితి అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందె శ్రీ కవి–గాయకులు అయన పాటలు భూమి ఉన్నంతవరకు జీవించి ఉంటాయన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయ హే తెలంగాణ పాట తెలంగాణ ఉద్యమానికి ఎంతో దోహదపడిందన్నారు,ఈ కార్యక్రమంలో ఆదర్శ కళా సమితి గౌరవ అధ్యక్షులు ఆకుల నరేష్–లావు డ్యా రమేష్,కొండూకూరి రాజు,మామిడి విజేయ్,కొండూకూరి ప్రభూదాస్,కుడికల రాజు,ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.





## ఎకరానికి 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
ఎకరా పంటకు ఎటువంటి షరతులు లేకుండా 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాలని కౌలు రైతులకు ఆధార్ కార్డ్ ప్రతిపదికన పత్తి కొనుగోలు చేయాలని బీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వైరాగడే మారుతి పటేల్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కాపాస్ కిసాన్ యాప్ వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎకరాకి కేవలం ఏడు క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తే మిగతా పత్తిని ప్రైవేట్ దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారని కౌలు రైతులు పట్టా పాస్ పుస్తకాలు లేక కాపాస్ కిసాన్ యాప్ లో కౌలు రైతుల ఎంపిక లేక ప్రైవేట్ దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని పత్తి రైతుల సమస్యలను పరిష్కారమయ్యే దిశగా రైతుల పక్షాన ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు.

## ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**కాసిపేట, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండల శివారులోని సర్వే నెంబర్ 8లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోనియకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలవేణి తిరుపతి దంపతులు కోరారు. ఈ మేరకు సోమవారం కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తండ్రి వారసత్వంగా వచ్చిన భూమిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టగా పెద్దనాన్న మనవడు, అతని బావమర్ది అడ్డుకొని హద్దులను తొలగించారని ఆరోపించఆరు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేసే వరకు ఎవరూ కూడా హద్దులు దాటవద్దని హెచ్చరించారని పేర్కొన్నారు. తమకు సమాచారం లేకుండానే విచారణ పేరుతో రాజకీయ అండదండలతో తమ ఇళ్లపైకి వెళ్తున్నారని వాపోయారు. అధికారులు చర్యలు తీసుకొని ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేసుకునే విధంగా సహకరించాలన్నారు.






## విద్యార్థులు దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలి

**తాండూర్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులు దేశభక్తి భావాలను పెంపొందించుకుని, ఉన్నతమైన లక్ష్యాల వైపు అడుగులు వేయాలని మండల విద్యాధికారి ఎస్ మల్లేశం, మాదారం ఎస్సై సౌజన్య కోరారు. నారీ యువశక్తి ఫోరం ప్రధాన కార్యదర్శి శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఝాన్సీ లక్ష్మీబాయిని విద్యార్థినులందరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆధునిక భారత దేశంలో మహిళల పాత్ర అనే అంశంపై ఉపన్యాసం, డిజిటల్ యుగంలో మహిళా రక్షణ అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో తాండూర్, అచ్చులాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉమాదేవి, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయ కులు దత్తాత్రేయరావు, బీజేపీ సీనియర్ నాయకులు తిరుపతి, భరత్ కుమార్ పాల్గొన్నారు.



## నన్ను ప్రేమించే ధైర్యం ఉందా?

'వీరసింహారెడ్డి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది హనీ రోజ్. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల వేదికగా చురుకుగా ఉండే ఈ భామ త్వరలో 'రాహేలు' సినిమాతో తెరపైకి రాబోతుంది. ఆమె ప్రధాన పాత్రలో ఆనందిని బాలా దర్శకత్వం వహించిన చిత్రమిది. పాన్ ఇండియా స్థాయిలో డిసెంబరు 6న థియేటర్లలోకి రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో మునుపెన్నడూ చూడని అవతారంలో కనిపిస్తూ సినీప్రియుల దృష్టిని ఆకట్టుకుంటోంది హనీ. "జాయ్ కూతురినే ప్రేమించే ధైర్యం ఉందా నీకు.." అంటూ ఆద్యంతం ఆసక్తిగా సాగుతుందీ ట్రైలర్. ఈ రివేంజ్ డ్రామాలో రోషన్ బషీర్, రాధికా రాధాకృష్ణన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## వెబ్ సిరీస్‌లో తమన్నా-కాజల్



మనీషా కోయిరాలా, సోనాక్షి సిన్హా, అతిది రావు హైదరీ, రిచా చద్దా, షర్మిన్ సెగల్ ఇలా బాలీవుడ్ భామలందర్నీ ఒకే ఫ్రేమ్ లో `హీరామండి: ది డైమండ్ బజార్` లో సంజయ్ లీలా భన్సాలీ ఎంత అందంగా.. అద్భుతంగా ఆవిష్కరిం చాడో చెప్పాల్సిన పనిలేదు. తొలి భాగం సీజన్ లో ఒక్కో పాత్ర ఒక్కో ఆణిముత్యంలా హైలైట్ అయింది. అందాల తారలంతా ఆ కథలో మహారాణుల్లా అలరించారు. ఓ పాత కథని సంజయ్ చెప్పడంతో ఇప్పటి జనరేషన్ కి కనెక్ట్ అవుతుందా? లేదా? అని రిలీజ్ కు ముందు ఎన్నో సందేహాలు వ్యక్తమయ్యాయి.కానీ రిలీజ్ అయిన తర్వాత ఫలితం అన్నింటిని పటా పంచల్ చేసింది. తన కళా ఖండంతో ప్రేక్షకుల్ని ఓ సరికొత్త ప్రపంచంలో విహరించేలా చేసాడు సంజయ్. తాజాగా ఇప్పుడీ సిరీస్ కు సీక్వెల్ కూడా ముస్తాబవుతుంది. మరికొన్ని రోజుల్లో సీక్వెల్ పట్టాలెక్కుతుందని రచయితల్లో ఒకరైన విభుపూరి తెలిపారు. ప్రస్తుతం సీక్వెల్ స్క్రిప్ట్ దశలో ఉంది. త్వరలోనే షూటింగ్ కి సంబంధించిన వివరాలు తెలియజేస్తాం అన్నారు. సీక్వెల్ లో యధావిధిగా పాత పాత్రలు కొనసాగుతాయి. అయితే వాటితో పాటు, మరికొన్ని కొత్త పాత్రలు యాడ్ కానున్నాయి.ఈ నేపథ్యంలో రెండు పాత్రలకు సౌత్ లో ఎంతో ఫేమస్ అయిన మిల్కీబ్యూటీ తమన్నా, చందమామ కాజల్ అగర్వాల్ ను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఆ రెండు పాత్రలు కూడా తొలి భాగం పాత్రలకు ధీటుగా మలుస్తారనే ప్రచారం జరుగుతోంది. ప్రత్యేకించి వీరిదర్నీ ఎంపిక చేసుకోవడానికి ఓ కారణం కూడా వినిపిస్తోంది. సౌత్ లో మరింతగా `హీరామండి` కనెక్ట్ అవ్వాలంటే కాజల్, తమన్నా లాంటి వారి సహకారం అవసరమని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరంగా ఇద్దరు సీక్వెల్ కు ప్లస్ అవుతారు.ఇద్దర్నీ కూడా ఆ పాత్రలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గానూ సంజయ్ భావిస్తున్నాడుట. ఇప్పటికే సౌత్ లో తమన్నా, కాజల్ అగర్వాల్ నటులుగా ఎగ్జిట్ అయ్యారు. అప్పడప్పుడు అవకాశాలు వస్తే నటించడం తప్ప! మునుపటిలా ప్రయాణం చేయడం లేదు. ఇలాంటి తరుణంలో హీరామండి లాంటి సిరీస్ లో ఛాన్స్ అంటే గొప్ప అవకాశంగానే భావించొచ్చు. ఇలాంటి సిరీస్ లు వాళ్ల కెరీర్ కు ఎంతో దోహదం చేస్తాయి. హీరోయిన్లగా, ఐటం భామలగా కోలీవుడ్ సహా టాలీవుడ్ లోనూ సత్తా చాటారు. కాజల్ వయసు ఇప్పటికే 40 దాటగా, తమన్నా 35 క్రాస్ చేసింది. `హీరామండి`లో ఇప్పటికే భాగమైన వారి వయసు కూడా 35 నుంచి 40 ఏళ్లు పైబడిన వారే. వారందరికీ తమన్నా, కాజల్ సరితూగే నటులే.



## యూనిసెఫ్‌లో భాగమవడం గర్వంగా ఉంది

యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్(యూనిసెఫ్)ఇండియాలో చేరడం తనకు గౌరవంగా ఉందన్నారు నటి కీర్తి సురేశ్. ఇటీవల ఆమెను యూనిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా నియమించింది. ఈ సందర్భంగా యూనిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రీ మాట్లాడుతూ.. "నటి కీర్తి సురేశ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడంతో యూనిసెఫ్ ఇండియా సంతోషంగా ఉంది. ప్రేక్షకులతో ఆమెకున్న అనుబంధం, పిల్లల హక్కులు, శ్రేయస్సు కోసం వాదించడానికి యూనిసెఫ్ ఇండియా ఆమెకు శక్తిమంతమైన, స్ఫూర్తిదాయకమైన వేదికను అందిస్తుంద"ని పేర్కొన్నారు. "పిల్లలు గొప్ప బాధ్యత. సంతోషం, ఆరోగ్యం, సంతృప్తితో కూడిన జీవితాలను గడపడానికి అవసరమైన సామాజిక భావోద్వేగ నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి పిల్లలు పునాదిని నిర్మిస్తారని నేను ఎల్లప్పుడూ నమ్ముతాను. ప్రతి బిడ్డ నేపథ్యం, సామర్థ్యంతో సంబంధం లేకుండా అభివృద్ధి చెందగలిగేలా అవగాహన పెంచడానికి యూనిసెఫ్ ఇండియాతో చేతులు కలపడం నాకు గౌరవంగా ఉంద"ని తనను ఎంపిక చేసినందుకుగానూ యూనిసెఫ్ ఇండియాకు కృతజ్ఞతలు తెలిపారు కీర్తి సురేశ్. ప్రస్తుతం ఆమె నటించిన 'రివాల్వర్ రీటా' ఈ నెల 28న విడుదల కానుంది.




## రష్మిక 'ది గర్ల్‌ఫ్రెండ్' మేనియా..

'నేషనల్ క్రష్' రష్మిక మందన్న ఈమధ్య కాలంలో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలను అందుకుంటున్న విషయం తెలిసిందే. పుష్పతో శ్రీవల్లిగా పాన్ ఇండియా క్రేజ్ ని అందుకున్న ఆమె అ తరువాత ఆనిమల్, ఛావా సినిమాలతో మరింత గుర్తింపు అందుకుంది. ఇక రీ సెంట్ గా ఆమె ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ 'ది గర్ల్‌ఫ్రెండ్' కూడా మంచి టాక్ ని సొంతం చేసుకుంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాపై ముందు నుంచీ మంచి అంచనాలు ఉన్నాయి. దీక్షిత్ శెట్టి హీరోగా నటించిన ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ (అల్లు అరవింద్) సమర్పించడం, హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించడంతో సినిమాకు పాజిటివ్ వైబ్ క్రియేట్ అయింది.ఈ నెల 7వ తేదీన థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు దక్కాయి. ఇది కేవలం రొటీన్ ప్రేమకథ కాకుండా, ఒక బలమైన సందేశంతో కూడిన "ఇంటెన్స్ రిలేషన్‌షిప్ డ్రామా"కావడంతో ఆడియన్స్‌కు బాగా కనెక్ట్ అయింది.విడుదలైన రోజు నుంచి బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా మంచి వసూళ్లను రాబడుతోంది. లేటెస్ట్‌గా, 'ది గర్ల్‌ఫ్రెండ్' టీమ్ తమ సినిమా గ్లోబల్ కలెక్షన్ల వివరాలను అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.28.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు వెల్లడించారు.కేవలం స్వదేశంలోనే కాదు, అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ సినిమా మంచి రెస్పాన్స్ ని అందుకుంది. ముఖ్యంగా నార్త్ అమెరికా మార్కెట్‌లో 'ది గర్ల్‌ఫ్రెండ్' సత్తా చాటింది. అక్కడ ఈ సినిమా ఇప్పటికే 650K డాలర్ల మార్క్ ని దాటింది. ఇది ఈ జానర్ సినిమాకు మంచి నంబర్‌గానే ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.ఈ వసూళ్లకు ప్రధాన కారణం రష్మికకు ఉన్న తిరుగులేని స్టార్ పవర్ అని చెప్పాలి. దానికి తోడు, రాహుల్ రవీంద్రన్ రాసుకున్న ఆకట్టుకునే కథనం కూడా ప్లస్ అయింది. అల్లు అరవింద్ సమర్పణలో, గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. పాజిటివ్ టాక్‌తో మొదలైన 'ది గర్ల్‌ఫ్రెండ్', లాంగ్ రన్‌లో ఇంకెంత వసూలు చేస్తుందో చూడాలి.



## విద్యార్థులు డిజిటల్ సామర్థ్యాలు, నైపుణ్యాలు సాధించాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ లెర్నింగ్‌లోని సాంఘిక శాస్త్రం, ఆంగ్లం పాఠ్యాంశాలకు సంబంధించిన డిజిటల్ సామర్థ్యాలు, 21వ శతాబ్దపు నైపుణ్యాలను విద్యార్థులకు సమర్థంగా బోధించాలనే లక్ష్యంతో ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం టెక్నాలజీ వినియోగం విస్తృతమైంది. రకరకాల యాపులు, బెట్టింగ్ యాప్లు, ఆన్లైన్ గేములు, తెలియని లింకులను క్లిక్ చేయడం వంటివి సాధారణ పౌరులు మోసాలకు గురయ్యే పరిస్థితులు సృష్టిస్తున్నాయి. కావున ఉపాధ్యాయులు ఈ అంశాలపై పూర్తి అవగాహన పెంపొందించుకొని, పాఠశాలలో 6, 9 తరగతి విద్యార్థులకు ప్రతి అంశాన్ని చేరేలా బోధించాలన్నారు. ఆంగ్ల ఉపాధ్యాయులు డిజైన్ ఆలోచన, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు డిజిటల్ పౌరసత్వం అంశాలను పాఠ్య ప్రణాళికల ప్రకారం బోధించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర రిసోర్స్ పర్సన్లు రాజు, విజయేష్, ఆంగ్ల ఉపాధ్యాయులు తులసిరామ్, ఉషన్న, ప్రిన్సిపల్ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

**బెల్లంపల్లి, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
కారు ఆటోకు తగలడంతో కారులో ఉన్న వ్యక్తులపై కత్తితో దాడికి ప్రయత్నించిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ హనూక్ సోమవారం తెలిపారు. నెన్నల్ మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కోడిప అశోక్ తన టీఎస్ 01 యు బి 6211 ఆటోలో నెన్నల్ నుండి జోగాపూర్ కు వెళుతుండగా ఘనపూర్ గ్రామం వద్ద గల స్పీడ్ బ్రేకర్ దగ్గర ఎదురుగా వస్తున్న టీజీ 24 02 03 నెంబర్ గల టాటా పంచ్ కారు చిన్నగా ఢీకొట్టింది. దీంతో ఆటో నడుపుతున్న కోడిపే అశోక్ ఆటో సీటు కింద ఉన్న కత్తి తీసి కారు నడుపుతున్న చీర హరీష్ కడుపులో పొడవడంతో కింద పడిపోయాడు. కారులో ఉన్న చీరల సురేష్ ను కూడా పొడిచేందుకు ప్రయత్నించాడు. కారు దిగి పారిపోతున్న పత్తి రెడ్డి అఖిల్, చీర్ల సురేష్ లను గ్రామస్తులు కాపాడారు. నిందితుడు అశోక్ గ్రామస్తులను చూసి పారిపోయాడు. గాయపడ్డ చీర్ల హరీష్ ను ప్రభుత్వ దావకానకు తరలించారు. కత్తితో దాడి చేసిన అశోక్ పై బాధితుడు చీర్ల సురేష్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సోమవారం నిందితుడు చిత్తపూర్ గ్రామ మామిడి తోటలో ఉన్నట్లు సమాచారం అందడంతో పట్టుకున్నట్లు సిఐ హనూక్ తెలిపారు. నిందితుడు అశోక్ సహకరించిన మరొక ఆటో డ్రైవర్ సిందం అంజితో పాటు అన్న కోడిప రాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుల ఆటోతో పాటు కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ హనూక్ తెలిపారు.



# దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి



### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే


**ఆసిఫాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్టణం సందీప్‌నగర్‌కు చెందిన షేక్ మున్నా తనకు పింఛను ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. సిర్పూర్ టి మండలం పూసిగూడ గ్రామానికి చెందిన గిరిజనులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అటవీ శాఖ సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం గోలేటికి చెందిన గుగ్లవత్ దేవయ్య తన తండ్రి పేరిట ఉన్న భూమిని ఆయన మరణించినందున తన పేరిట విరాసత్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చింతలమనేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన యువకులు తమ గ్రామపంచాయతీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. సిర్పూర్ (టి) మండల కేంద్రానికి చెందిన దుర్గం నిర్మల తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ టి మండలం పారిగాం గ్రామానికి చెందిన కొండగుర్ల కారుబాయి తన భర్త మరణించినందున డెత్ సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ పట్టణంలోని రిక్షా కాలానికి చెందిన ఫర్వీన్ సుల్తానా తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం నంబాల గ్రామానికి చెందిన పెద్దపల్లి లక్ష్మి తాను సాగు చేస్తున్న భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఐ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాల ఏర్పాటు



**ఆసిఫాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని చిర్రకుంట ఎక్స్‌రోడ్ నుండి అంకుశాపూర్ మెడికల్ కళాశాల వరకు వీధి దీపాల లేమితో ప్రజలు, విద్యార్థులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని సీఐ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మెడికల్ కాలేజీతో పాటు పరిసర గ్రామాల ప్రజలు రాత్రి సమయంలో ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి దాతల సహకారంతో వీధి దీపాలు అమర్చించి లైట్లను వెలిగించమని తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కారం దిశగా కృషి చేస్తున్న సీఐ బాలాజీ వరప్రసాద్‌ను మెడికల్ కళాశాల విద్యార్థులు, స్థానిక గ్రామాల ప్రజలు అభినందించారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయండి. సమస్య పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని సీఐ తెలిపారు.

## సీసీఐ వైఖరికి నిరసనగా జిన్నింగ్ మిల్లులు బంద్




**ఆదిలాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
పత్తి కొనుగోలులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు జిన్నింగ్ వ్యాపారులు ఆందోళన బాట పట్టారు. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ పరిశ్రమలు మూసివేసి నిరసన తెలిపారు. సీసీఐ తమ పరిశ్రమలను లీజుకు తీసుకొని పత్తిని ఇవ్వకపోవడంతో నష్టపోతున్నామని జిన్నింగ్ వ్యాపారులు ఆరోపించారు. సీసీ అధికారులు ఎల్1, ఎల్2 నిబంధనలు పాటిస్తూ కొన్ని పరిశ్రమలకు మాత్రమే బేళ్లతయారీకి పత్తిని కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. వీనింగులకు సమానంగా పత్తిని కేటాయించాలని అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయిందని జిన్నింగ్ వ్యాపారులు పేర్కొన్నారు.

### ఇబ్బందులు పడ్డ రైతులు

పరిశ్రమలు మూతపడడంతో జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోలు నిలిచిపోయాయి. దీంతో కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకుని పత్తిని విక్రయించడానికి సిద్ధమైన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైతే ప్రభుత్వం తేమ పేరిట పంట కొనుగోళ్లను తిరస్కరిస్తుండటంతో ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి క్వింటాలుకు రూ.1,300 చొప్పున నష్టపోయామని తెలిపారు. జిన్నింగ్ వ్యాపారుల సమ్మె వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు తెలిపారు. సీసీఐ రోజుకో నిబంధనతో ఇబ్బందులకు గురిచేస్తుందని, కొనుగోలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

**మంచిర్యాల, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
రోడ్డు ప్రమాదాల నివారణకుడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లాలోని ఇందారం జాతీయ రహదారి బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఇందారం క్రాస్ రోడ్డు మూలమలుపు వద్ద ఏర్పాటు చేస్తున్న ఐలాండ్ లా ఏర్పాటు డిజైన్, సీసీ కెమెరాల ఏర్పాటు, రేడియం బ్లింకర్స్, స్టడ్స్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి ప్రమాదాల నివారణకు దిశా నిర్దేశం చేశారు. రోడ్డు సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి ప్రమాదాలపై క్షేత్రస్థాయిలో బ్లాక్ స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ తరపున ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రతి ఒక్క వాహన దారుడు రోడ్డు నిబంధనలు పాటించాలని అన్నారు. బైక్ లపై త్రిబుల్ రైడ్, సెల్ఫోన్ మాట్లాడుతూ వెళ్లటం, మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని అన్నారు. వాహన దారుడు హెల్మెట్ లేకుండా నడపడం మూలంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ ఆంక్షలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. అరైవ్ అలైవ్ పై ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాద రహిత రామగుండం కమిషనరేట్ గా పేరు తీసుకురావాలని అన్నారు. అధికారులు ఫోర్ వే లైన్స్ పై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ వివరాలను తెలుసుకున్నారు. రాత్రిపూట సిగ్నల్స్ కనబడే విధంగా పూర్తి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులకు అవగాహన కల్పించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం, మంచిర్యాల జిల్లా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు రాజేశ్వర్ రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



# వచ్చే నెలలో స్థానికం

- వీలైనంత తొందరగా పూర్తి చేయాలి..
- లాస్ట్ మంథ్‌లో నిర్వహించాలి..
- జూబ్లీహిల్స్ ఉత్సాహంతో ముందుకుసాగాలి..
- స్థానిక ఎన్నికలపై కేబినెట్‌లో చర్చ
- 1 నుంచి 9వరకు ప్రజాపాలన వారోత్సవాలు
- రైతు భరోసా నిధుల విడుదలకు ఆమోదం

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

"ఇప్పటికే బాగా ఆలస్యమైంది.. ఇంకా లేట్ చేయొద్దు.. వీలైనంతా త్వరగా పూర్తి చేయాలి. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక విజయోత్సాహాన్ని స్థానికంలోనూ కొనసాగించాలి.. డిసెంబర్ రెండు లేదా మూడో వారంలో ఎన్నికలు పూర్తి చేయాలి" అనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రి వర్గ సమావేశం జరిగింది. ఇందులో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై డిస్కషన్ నడిచినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీర రెండేళ్లు కావొస్తున్న సందర్భంగా.. డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 'ప్రజా పాలన వారోత్సవాలను' ఘనంగా నిర్వహించాలని సర్కార్ నిర్ణయించింది. ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘంతో చర్చించి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అంటే డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికలు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇక గతంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం.. దానికి సంబంధించిన జీవోపై స్టే రావడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గం సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ తెలంగాణ ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. వారో త్సవాల్లో భాగంగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులన ప్రజలకు వివరించడంతో పాటు పథకాలకు దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించారు. ఇక కేబినెట్ లో రైతు భరోసా నిధుల విడుదలతో పాటు గిగ్ వర్కర్స్ బిల్లు కూడా ఆమోదించారు.ప్రజా పాలన వారోత్సవాల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణ ఆలస్యమైన నేపథ్యంలో ఇక ఆలస్యం చేయొద్దని.. వీలైనంత తర్వగా లోకల్ బాడీ ఎలక్షన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. డిసెంబర్ 2వవారం లేదా.. 3వ వారంలో గానీ ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన దరిమిలా.. అదే ఉత్సాహంతో లోకల్ బాడీ ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ప్రజాపాలన వారోత్సవాల్లో గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రచారం చేసి.. ఎన్నికల్లో జయకేతనం ఎగురవేసేందుకు రెడీ అయింది.

**రిజర్వేషన్లపై సందిగ్ధం..**

బీసీ రిజర్వేషన్ల అంశంతో.. స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం అవుతున్న విషయం తెలిసిందే. బీసీలకు 42% కోటా విషయంలో కోర్టు స్టే ఉన్నప్పటికీ, పార్టీ వారీగా రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు జరపాలనే అంశం పై చర్చించారు. తదుపరి న్యాయపోరాటం తర్వాత నిర్ణయం తీసుకోవాలని చర్చించినట్లు తెలిసింది. గతంలో ఎన్నికల నోటిఫికేషన్ ఎన్నికల కమిషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో .. దానికి సంబంధించిన జీవోపై స్టే రావడంతో ఎన్నికల ప్రక్రియ ఆగిపోయింది. రిజర్వేషన్లు రివైజ్ చేసి.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించుకండా.. ఎన్నికలు నిర్వహించుకోవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రభుత్వం ఎన్నికలను దశలవారీగా నిర్వహించేందుకు మొగ్గు చూపుతోంది. మొదట సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాత కొంత సమయం తీసుకుని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.



## అన్ని వసతులతో క్యాంపు ఆఫీసు నిర్మాణం

**నిర్మల్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ క్యాంప్ కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమి పూజ చేసారు. రూ. 8.10 కోట్లతో 5.38 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే భవన నిర్మాణానికి భూమి పూజ చేసారు. అనంతరం భవన నిర్మాణానికి సంబంధించి అధికారులతో సమీక్ష నిర్వహించి, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మాజీ ఉమ్మడి నిర్మల్ మండల పరిషత్ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేంద్రం కృషి

**ఆదిలాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

ఆదివాసీ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలం పోతాగూడ గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సాటిలైట్ సెంటర్‌లో ప్రధానమంత్రి జన్ మన్ యోజన పథకం కింద రూ. 2.75 కోట్లతో నూతనంగా నిర్మించే హాస్టల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పీఎం జన్మన్ యోజన పథకం ద్వారా పలు గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ప్రభుత్వ విద్య విధానం బలోపేతానికి కేంద్రం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజే పీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోళ్లు బంద్

- రాష్ట్ర కాటన్ అసోసియేషన్ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో నిలిచిపోయిన కొనుగోళ్లు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మార్కెట్‌లో కొనుగోలు చేయని వ్యాపారులు
- జిన్నింగ్ మిల్లుల్లోనూ నిలిచిన కొనుగోళ్లు
- సీసీఐ నిబంధనలను సడలించాలని డిమాండ్
- ఆందోళన చెందుతున్న రైతులు
- పత్తి చుట్టూ ముదురుతున్న రాజకీయం
- నేడు భైంసా, ఆదిలాబాద్‌కు రానున్న కేటీఆర్



(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిచి పోయాయి. సీసీఐ నిబంధనలు సడలించాలని వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు డిమాండ్ చేస్తూ కొనుగోళ్లను బంద్ చేయాలని పిలుపునిచ్చారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా పత్తి కొనుగోళ్లు జరగలేదు. నాలుగు రోజుల ముందుగానే కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో పత్తి రైతులు కూడా మార్కెట్లకు సరుకు తీసుకురాలేదు. అతిపెద్ద మార్కెట్ ఆదిలాబాద్‌లో కూడా పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. మిల్లుల కేటగిరిని నిలిపివేయాలని, కపాస్ కిసాన్ యాప్‌లో సడలింపులు ఇవ్వాలని, అన్ని మిల్లులకు అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో వైపు పత్తి కొనుగోళ్ల చుట్టూ రాజకీయం ముదురుతోంది. అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ అంశానికి తెరలేపింది. ప్రతిపక్ష పార్టీల నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతులను పట్టించుకోకపోవడంతోనే ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వర్షాలతో ఇప్పటికే రైతులు నష్టపోయారని, ఎలాంటి కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నేడు భైంసా, ఆదిలాబాద్ మార్కెట్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారని, పత్తి రైతుల సమస్యలను తెలుసుకోనున్నట్లు ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ జిన్నింగ్ మిల్లుల యజమానులు సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిపివేయగా, ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ వ్యాపారులు ఎక్కడ పడితే అక్కడ దుకాణాలు తెరిచి అందినకాడికి దండుకుంటున్నారు. సర్కారు క్వింటాలుకు రూ.8110 చొప్పున ధర నిర్ణయించగా, దళారులు రూ. 6500 నుంచి రూ. 7 వేల చొప్పున కొంటూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు.

**ముంచిన అకాల వర్షాలు...**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ ఏడాది 3.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. పెరిగిన విత్తనాలు, ఎరువుల ధరలతో పాటు సాగుకోసం ఒక్కో ఎకరానికి కనీసం రూ. 40 నుంచి రూ. 50 వేల దాకా ఖర్చు చేశారు. కనీసం ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. లాభాల మాట ఎలా ఉన్నా.. కనీసం పెట్టుబడుల మందమైనా వచ్చే అవకాశముంటుందని రైతులు భావించారు. ఈ క్రమంలో పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలు రైతులను నిలువునా ముంచేశాయి. తుపాన్ ప్రభావంతో ఏకధాటిగా కురిసిన వర్షాలకు ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి నల్లబడిపోయింది. మళ్లీ పూత కాత వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గతంలో ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కానీ, ఈ ఏడాది అకాల వర్షాల వల్ల కనీసం 3 నుంచి 4 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఒకవేళ ఉన్న పత్తి తీద్దామంటే కూలీలకు కిలోకు రూ. 10 నుంచి రూ. 12 దాకా అవుతుండడంతో.. కొందరు ఏరకుండానే పత్తిని చేలల్లోనే వదిలేశారు.

**కొనుగోళ్లు నిలిచిపోవడంతో..**

జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు నిలిపివేయడంతో ప్రైవేట్ వ్యాపారులకు కలిసి వస్తున్నది. ఎక్కడ పడితే అక్కడ రోడ్ల పక్కన దుకాణాలు తెరిచి కొనుగోళ్లు చేపడుతూ రైతులను దొచుకుంటున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 8110 చొప్పున ధర నిర్ణయించగా, దళారులు రూ.6500 నుంచి రూ.7 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇకనైనా సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు జరిగేలా చూడాలని కర్షకులు వేడుకుంటున్నారు.

## నేడు ఆదిలాబాద్‌కు కేటీఆర్ రాక

### మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఈనెల 17వ తేదీన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్ కు రానున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చి రైతులతో మాట్లాడి, ఇబ్బందులను తెలుసుకుంటారన్నారు. అనంతరం సీసీఐ అధికారులతో సైతం సమావేశం అవుతారని తెలిపారు. సోమవారం ఆదిలాబాద్‌లోని మార్కె ట్ యార్డ్‌లో కొనుగోళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ... గత కొన్ని నెలల క్రితం కురిసిన భారీ వర్షాలతో పాటు ప్రస్తుత చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున పంటల్లో తేమశాతం ఎక్కువగా ఉందన్నారు. కావున తేమ శాతం, డ్యామేజ్ నిబంధనలకు సంబంధం లేకుండా తడిసిన పత్తి, సోయా పంటను సైతం రైతుల నుండి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర



ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ ఎస్ పార్టీ నాయకులు, రైతులు ఉన్నారు. అలాగే పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో మంగళవారం భైంసాకి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు వస్తున్నారని వస్తున్నారని బిఆర్ఎస్ ముధోల్ సమన్వయ నాయకులు విలాస్ గాదేవర్, రమాదేవి తెలిపారు.

## ప్రభుత్వ బడి నిర్మాణానికి భూమి పూజ

**ఆసిఫాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలోని గాదిగూడ మండలంలో గల కొలంగూడ గ్రామంలో ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ అఫ్ ఇండియా పథకం కింద నూతన గిరిజన ప్రభుత్వ పాఠశాలను నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఎంపీ నగేష్, ఎమ్మెల్యే కోవలక్ష్మి నూతన ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్య ప్రమాణాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులతో పాటు అధికారులు పాల్గొన్నారు.












# ఉట్నూర్‌లో సాండ్ బజారు ప్రారంభం

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తీరిన ఇసుక సమస్య - సాండ్ బజారును ప్రారంభించిన ఎమ్మెల్యే, ఐటిడిఎ పిఓ**

**ఉట్నూర్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక సమస్య తీరింది. ఇసుక దొరక్క ఇళ్ళ నిర్మాణలు ముందుకు సాగక లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని లబ్ధిదారులకు ఇసుకను అందుబాటులో ఉంచేందుకు ఉట్నూర్ లో సాండ్ బజారు ఏర్పాటు చేసారు.తెలంగాణ మినరల్ డేవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజారును సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ యువరాజ్ మర్మాట్ తొ కలిసి ప్రారంభించారు. ఈ సాండ్ బజార్ ఏర్పాటు జిల్లాలోనే మొదటిది కావడం విశేషం. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉట్నూర్ సాండ్ బజార్ ఏర్పాటుపై ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరం అయ్యే ఇసుక సమస్య తీరినట్లేనన్నారు. టన్ను ఇసుకకు రూ 12వందలు చెల్లించాలని, ఇసుక కావాల్సిన వారు 155242కి టోల్ ఫ్రీ నెంబర్ కి సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సాండ్ బజార్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అదిలాబాద్ జిల్లా, పరిసర ప్రాంత గ్రామాలలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు, సామాన్య ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండే విధంగా ఉట్నూర్ పట్టణంలో సాండ్ బజార్ ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, సామాన్యులకు అందుబాటులో ఇసుకను ఉంచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సాండ్ బజార్ ద్వారా అందరికీ అవసరమైన ఇసుక సులభంగా లభ్యమయ్యే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇక్కడ ఇసుక పొందే అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఇంటి యజమాని ఇల్లు నిర్మాణానికి కావలసిన ఇసుకను ఆన్ లైన్ లో నమోదు చేసుకునేందుకు https://sand.telangana.gov.inలో, మొబైల్ నెంబర్ 9951176515 లో సంప్రదించవచ్చని తెలిపారు.కార్యక్రమం లో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# ఎట్టి పరిస్థితుల్లోనూ అడవిని వీడి వెళ్లేది లేదు





**బలవంతం వెళ్లగొడితే.. ప్రాణాలకు తెగిస్తాం - ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సొనేరావ్**
**చెట్లకు కట్టేసి కొడతామని గతంలోనే హెచ్చరించా - అటవీ శాఖ అధికారులపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మండిపాటు**

**ఉట్నూర్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే ఆదివాసీ బిడ్డలం అడవులలో నివాసముంటూ జీవనం కొనసాగిస్తున్నామని, ప్రభుత్వాలు చట్టాలను వారికి అనుకూలంగా మర్చుకోని ఇప్పుడు తమల్ని ఇళ్లు నిర్మించుకోకుండా అటవీ ప్రాంతాల నుంచి వెళ్లగొట్టేందుకు కుట్ర లు పన్నుతున్నారని వారు వెళ్లగొడితే తాము వెళ్లిపోయ్యేందుకు సిద్ధంగా లేమని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సొనేరావ్ హెచ్చరించారు. ఆదివాసీ కొలాం కులస్తుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐటీడీఏ ఉట్నూర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ముందు ర్యాలీగా ఐటీడీఏ కార్యాలయానికి చేరుకున్నారు. తమ అభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకుంటున్నా యని అంటూ ఆయా ప్రభుత్వాలకు వ్యతిరేకం గా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొడప సొనేరావ్ మాట్లాడుతూ అధికారులు పీవీటీజీల అభివృద్ధికి సహకరిస్తామని అంటునే పక్కా ఇళ్లు నిర్మాణం చేసుకోకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఇళ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తే ఉన్న గుడిసేను తొలగించి చలిలో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. తాము ఏమీ వలసవాదులం కదాని, తాతా, ముత త్తాల కాలం నుంచి అటవీ ప్రాంతాలలో నివాసముంటున్నా మన్నారు. 1930, 1947, 1956 కంటే ముంద నుంచి ఎవరు అటవీ ప్రాంతాలలో నివాసముంటున్నారో ప్రభుత్వాలు తెలుసుకోవాలన్నారు. అసలు అటవీ దొంగలను అధికారులు పట్టుకోకుండా బలవంతం గా ఫొటోలు తీసి అమాయకులైన కొలాం కులస్తులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారన్నారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీల ధర్నా విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్తో కలిసి ధర్నా ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అటవీ ప్రాంతాలలో నివాసముంటున్న ఆదివాసులకు ఇబ్బందులకు గురి చేయడం, అభివృద్ధిని అడ్డుకుంటే చెట్లకు కట్టేసి కొడతామని గతంలోనే అధికారులకు హెచ్చరికలు జారీ చేయడం జరిగిందని అన్నారు. పీవీటీజీల సమస్యలపై సీఎంతో పాటు సంబంధిత అటవీ శాఖ మంత్రితో మాట్లాడం జరిగిందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తనతో పాటు ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకు రావాలన్నారు. పీవీటీజీల ఇండ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 3.75 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ. 1.75 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఉండి ఆదివాసుల సమస్యలపై అధికారులతో గొడవ పడుతునని పేర్కొన్నారు. ఎవరైనా అధికారులు తన దృష్టికి సమస్యను తీసుకురాకుండా బలవంతంగా ఆదివాసులను అటవీ ప్రాంతం నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తే సహించేది లేదన్నారు. ఆదివాసుల ఓపిక నశిస్తే వారిని ఆపే తరం ఎవరిది కదన్నారు. పీవీటీజీల సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరం అయ్యేలా కృషి చేస్తానని, సమస్య పరిష్కరం కాకపోతే పీవీటీజీలు తన ఇంటి ఎదుట వచ్చి ధర్నా చేయవచ్చాన్నారు. జిల్లా స్థాయి అధికారులు ఏసీలలో ఉంటూ కింది స్థాయి అధికారులను బాధ్యులు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్ర రాజు, గౌరవ అధ్యక్షుడు టేకం లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్ రావ్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆత్రం జలపత్రావ్, టేకం గణేష్, మడావి కిషన్, మహిళ సంఘం నాయకురాలు నాగుబాయి, లక్ష్మీబాయి, రాజ్గొండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషం రావ్, ఆదివాసీ సంఘాల నాయకులు టేకం వసంత్రావ్, కుర్సేంగే తానాజీ, పుర్క బాపురావ్, పెందూర్ పుష్పరాణి, రితేష్ రాథోడ్, సెడ్మకి ఆనంద్రావ్, కొడప రాము, కుమ్ర జలపత్రావ్, తదితరులు పాల్గొన్నారు.



## ఐటీడీఏలో బ్యాక్ లాక్
# ఉద్యోగాలను భర్తీ చేయాలి
### తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం

**ఉట్నూర్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
ఐటీడీఏ పరిధిలోని బ్యాక్ లాక్ ఉద్యోగాలను రెగ్యులర్ ప్రాతిపదికన గిరిజనులతో భర్తీ చేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం తనుష్ డిమాండ్ చేశారు. సోమవారం ఐటీడీఏ ముందు నిరసన తెలిపి ఐటీడీఏ పీఓ ఇంచార్జ్ పీఓ యువరాజ్ మర్మట్‌కు వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆత్రం తనుష్ మాట్లాడుతూ ఐటీడీఏ లోని బ్యాక్ లాక్ ఉద్యోగాలను గత కొన్ని ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేసి ప్రతి ఏడాది రెన్యువల్ చేస్తూ వస్తున్నారన్నారు. దీని వల్ల ఏజెన్సీ ప్రాంతంలోనీ నిరుద్యోగ యువతి, యువకులు నష్టపోతున్నారన్నారు. అదే విధంగా ప్రభుత్వం ఐటీడీఏ ఆధ్వర్యంలో స్పెషల్ డీఎస్సీని ప్రకటించాలని, ట్రైకార్ రుణాలు మంజూరు చేసి, గిరిజనులను పారిశ్రామి కవేత్తలు ఎదిగేందుకు ఐటీడీఏ అధికారులు, ప్రభుత్వం ప్రోత్సహించి తగిన న్యాయం చేయాలని, సుప్రీంకోర్టు కొట్టేసిన జీఓ నెంబర్ 3ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## సిర్పూర్ (యూ)లో
# 7 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు

**ఆసిఫాబాద్, నవంబర్ 17 (ప్రభాత సమాచారం)**
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతలలో అత్యల్పంగా ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యు) మండలంలో 7 డిగ్రీలు నమోదైంది. ఉష్ణోగ్రతలు పడిపోతూ ఉండటంతో చలి తీవ్రత పెరిగింది.